క్లుప్తంగా

'మనఊరు-మనబడి' పనులు పరిశీలన



దుస్తువులు పరిశీలిస్తున్న డీఈఓ

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 'మనఊరు–మనబడి' పనులను శనివారం డీఈఓ ఎస్.యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో డిజిటల్ టీవీలు, డైనింగ్‌హాల్, మరుగుదొడ్ల పనులు పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న మరుగు దొడ్లు, తాగునీటి పనులను సత్వరంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లను డీఈఓ ఆదేశించారు. ఆ తర్వాత విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతున్న రాజ్యలక్ష్మి కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. జూన్ 2వరకు దుస్తువుల కుట్టుపని పూర్తి చేయాలని సూచించారు. డీఈఓ వెంట సెక్టోరల్ అధికారి చౌదరి, ఎంఈవో ప్రభాకర్, ఎంఆర్‌సీ సిబ్బంది ఉన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



కట్టడాలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఊత్కూరు శివారులో 375సర్వే నంబర్ భూమిలో ఉన్న అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. ఆ భూములు టీఎస్ జీఓలకు ప్రభుత్వం ప్రకటించినట్లు, ఎవరూ కట్టడాలు చేపట్టొద్దని సూచించారు. అనుమతులు లేకుండా నిర్మించిన కట్టడాలను తొలగించినట్లు, ఎటువంటి కట్టడాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఆర్ఐ సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.


పౌష్టికాహారం తీసుకోవాలి

బెల్లంపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని బెల్లంపల్లి జన్ ఆరోగ్య సమితి చైర్మన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ అన్నారు. మున్సిపాలిటీలోని షంషీర్‌నగర్‌లో శనివారం జన్‌ఆరోగ్య సమితి నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులకు క్రమం తప్పక ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలన్నారు. తగిన పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండాకాలంలో అవసరమైతే గర్భిణుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేయాలని, రాబోయే వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పురప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఏఎస్ఎంలు పురప్రజలకు అవగాహన కల్పించడంలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డాక్టర్ విజయకుమారి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

దండేపల్లి: ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేందుకే జన ఆరోగ్య సమితీలు ఏర్పాటు చేసిందని ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం జన ఆరోగ్య సమితి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనఆరోగ్య సమితి ఉద్దేశాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సతీష్ వివరించారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడంతో పాటు, అవగాహన కల్పించేందుకు ప్రతి నెలా సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ హన్మంతరావు, ఎంపీడీవో మల్లేశం, ఎంపీటీసీ రాజన్న, యూత్ నాయకులు మహేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీరాములు, పీఏసీఎస్ చైర్మన్ మల్లేష్

నెన్నెల: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీరాములు అన్నారు. మండలంలోని చిన్నవెంకటాపూర్‌లో పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్‌తో కలిసి శనివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్లి నష్టపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేకల శారద, ఎంపీటీసీ శ్రీనివాస్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ సందడి..!

- ఈతపై పిల్లలు, పెద్దల ఆసక్తి
- కిటకిటలాడుతున్న మంచిర్యాల క్లబ్ స్విమ్మింగ్‌పూల్

SUNDAY SPECIAL







జిల్లా కేంద్రంలో స్విమ్మింగ్ చేస్తున్న చిన్నారులు

మంచిర్యాలటౌన్: ప్రస్తుతం జిల్లాలో ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతుండడం, వేసవి సెలవులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు, ఆరోగ్యంగా ఉండేందుకు స్విమ్మింగ్ వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఈ వేసవిలో ఉదయం నుంచే ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో వేసవి సెలవుల్లో పిల్లలు, పెద్దలు బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి. వేసవి సెలవుల్లో పలు రకాల క్రీడలు, డ్యాన్స్ వంటి వాటిల్లో శిక్షణను పలు సంస్థలు ఇస్తున్నాయి. అయితే వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు వివిధ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. దానిలో భాగంగా జిల్లా కేంద్రంలోని మంచిర్యాల క్లబ్‌లో గల స్విమ్మింగ్‌పూల్‌లో పెద్దలు, యువత, మహిళలు, చిన్నారులతో కిటకిటలాడుతుంది. గత కొన్నేళ్లుగా ఈ స్విమ్మింగ్‌పూల్‌లో వేసవిలో సందడిగా ఉంటుంది. అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుని, కోచ్‌ను ఏర్పాటు చేసి క్లబ్ నిర్వాహకులు క్లబ్‌లో సభ్యత్వం ఉన్న వారి కుటుంబ సభ్యులందరికి కలిపి నెలకు రూ.2,500 తీసుకుంటుండగా, సభ్యత్వం లేని బయటి వారిలో ఒక్కొక్కరికి రూ.2వేల ఫీజుతో స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు.

ఈతతో ప్రయోజనాలెన్నో...

ఈత కొట్టం వల్ల వేసవి తాపం నుంచి ఉపశమనం కలగడమే కాక, మంచి ఆరోగ్యం లభిస్తుంది. క్రమం తప్పకుండా ఈతకొడితే ఒంట్లో ఉండే అనవసరపు కొవ్వు కరుగుతుంది. ఆకలి, చురుకుదనం, జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతాయి. మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు అదుపులో ఉంటాయి. 30నిమిషాల పాటు ఈత కొడితే సుమారు 300కెలరీలు ఖర్చవుతాయి. పూల్‌లో ఈతకొట్టే ముందు నీరు శుభ్రంగా ఉందో లేదో గమనించాలి. ప్రస్తుతం వేసవిలో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో పాటు, పెద్దలు వస్తున్నారు. పిల్లలకు సంబంధించి రెండు బ్యాచ్‌లు సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు, 6గంటల నుంచి 7గంటల వరకు రెండు బ్యాచుల్లో 30 మందికి సమయాన్ని కేటాయించగా, పెద్దలకు ఉదయం 5:30నుంచి 8:30గంటల వరకు మూడు బ్యాచ్‌లలో బ్యాచ్‌కు 40మందికి పైగా వస్తున్నారు. ఉదయం 8:30నుంచి 9:30గంటల వరకు మహిళలు, బాలికలకు ప్రత్యేకంగా బ్యాచ్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 20మంది వస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- స్విమ్‌సూట్స్, క్యాప్స్, గాగుల్స్, ట్యూబ్‌లు తప్పనిసరి.
- ఈతరాని వారి వెంట ఎవరో ఒకరు ఉండాలి.
- చిన్న పిల్లలు కోచ్ పర్యవేక్షణలో ప్రాక్టీస్ చేయాలి.
- తల వెంట్రుకలు రాలకుండా క్యాప్ వాడాలి.
- ఈత కొట్టిన తరువాత మళ్లీ స్నానం చేయాలి.

ఈత వల్ల ఎంతో ప్రయోజనం



స్విమ్మింగ్ వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. మంచిర్యాల క్లబ్‌లో స్విమ్మింగ్ నేర్చుకునేందుకు పిల్లలు, పెద్దలు, మహిళలు ఆసక్తిని చూపించి వస్తున్నారు. అన్ని రకాల జాగ్రత్తలను తీసుకుని, ఉదయం, సాయంత్రం వేళల్లో బ్యాచ్‌ల వారిగా సమయాన్ని కేటాయించాం. పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేలా, ఇద్దరు కోచ్‌లం పిల్లలకు సరైన రీతిలో నేర్పిస్తున్నాం. స్విమ్మింగ్‌పూల్‌లో నీరు ఎప్పటికప్పుడు తొలగించడం, వచ్చిన వారికి ఎలాంటి సమస్యలు లేకుండా ఈత నేర్పిస్తున్నాం. పిల్లలు ఎంతో సరదాగా తొందరగా నేర్చుకుంటున్నారు.

– ఓదెలు, స్విమ్మింగ్‌పూల్ కోచ్, మంచిర్యాల

నెల రోజుల నుంచి నేర్చుకుంటున్న



రెండేళ్లుగా ప్రతి వేసవిలో ఈత నేర్చుకోవాలని వస్తున్నా. గతేడాదే ఈత పూర్తిగా నేర్చుకున్నా. ఈ వేసవి సెలవుల్లో మరింతగా మెరుగ్గా ఈత నేర్చుకుంటున్నాను. నాతో పాటు, చాలా మంది వస్తున్నారు. సరదాగా నేర్చుకుంటున్నాం

.– ఎగ్గన అగస్త్య, 8వ తరగతి, మంచిర్యాల

ఆరోగ్యానికి మంచిదనే...



స్విమ్మింగ్ వల్ల ఆరోగ్యానికి మంచిదనే నన్ను ప్రతిరోజు ఉదయం స్విమ్మింగ్‌కు పంపిస్తున్నారు. నెల రోజుల నుంచి ప్రతిరోజు ఉదయం స్విమ్మింగ్‌కు వచ్చి, ఒక గంటసేపు స్విమ్ చేస్తున్నాను. దీంతో రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.

– మహి అగర్వాల్, 6వ తరగతి, మంచిర్యాల

చల్లగా, హాయిగా ఉంది..



స్విమ్మింగ్ చేస్తుంటే చల్లగా, హాయిగా ఉంది. వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడం ప్రస్తుతం ఇది రెండో సంవత్సరం. ఎండ వేడికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లనీయడం లేదు. స్విమ్మింగ్ అంటే ఎంతో ఇష్టం. అందుకే ప్రతిరోజు ఉదయం వచ్చి స్విమ్మింగ్ నేర్చుకుంటున్నా. నీళ్లలో దిగగానే చల్లగా ఉండి ఎంతో హాయిగా ఉంటుంది.

– అన్షుల్, 9వ తరగతి మంచిర్యాల

వీవోఏల నిరసన



దండేపల్లి: నిరసన తెలుపుతున్న వీఓఏలు

దండేపల్లి: సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేస్తున్న సమ్మె శనివారం కొనసాగింది. స్థానిక అంబేద్కర్ విగ్రహం సమీపంలో రోడ్డుపై మానవ హారంగా నిలబడి బతుకమ్మ ఆడుతూ, నిరసన తెలిపారు. తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వీవోఏ మంజుల అస్వస్థతకు గురికావడంతో, ఆమెను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు.

పర్యావరణంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

బెల్లంపల్లిరూరల్: మండలంలోని మాలగురిజాల, లంబాడితండా, గురిజాల గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. నీటిని పొదుపు చేయడం, అధిక నీటి వనరుల కోసం చర్యలు చేపట్టాలని గ్రామీణులకు సూచించారు. మొక్కలు సంవృద్ధిగా పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడొచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అశోక్, రంజిత, రాయమల్లు, ఎంపీటీసీ శకుంతల, జీపీఎస్‌లు కార్తీక్, లక్ష్మి, అగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కమిటీ సమావేశం

దండేపల్లి: తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 22న మంచిర్యాల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్ తెలిపారు. దండేపల్లిలో శనివారం సీనియర్ సిటిజన్ మండల నాయకులతో ఆయన సమావేశమయ్యా రు. జిల్లాలోని అన్ని మండలాల సీనియర్ సిటిజన్స్ సమావేశానికి హాజరవ్వాలని కోరారు. సమావేశం అనంతరం నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

'వసతులు కల్పించడంలో ఎమ్మెల్యే విఫలం'



సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ప్రజలకు కనీస వసతులను కల్పించడంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని 17వ వార్డు బృందావన కాలనీ, వాసుదేవ కాలనీ, సీతారామ కాలనీలో శనివారం గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ... పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పట్టణంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్య మురుగు నీరు చేరి, కాలనీలో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో డ్రెయినేజీలతో పాటు, తాగునీరు, రోడ్లు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, రజనీశ్ జైన్, పూదరి రమేశ్, ముదాం మల్లేశ్, పూదరి రామ్‌చందర్, రంగ శ్రీశైలం, కీర్తి రమేశ్, రుద్ర భూమయ్య, ఓదెలు, తోట తిరుపతి, ఆకాష్, రామకృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్, ట్రైయినీ కలెక్టర్

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి 15వార్డులో శనివారం సానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైయినీ కలెక్టర్ గౌతమి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు పరిశీలించి వీధుల్లో, మురికి నీటి కాలువల్లో చెత్తా చెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, సిబ్బంది, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఆర్ కేంద్రం ప్రారంభం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ట్రిపుల్ ఆర్ కేంద్రాన్ని శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత ప్రారంభించారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది, బస్తీ వాసులు పాల్గొన్నారు.

రాముని చెరువు స్థలాన్ని కాపాడండి

మంచిర్యాలటౌన్: రాముని చెరువు స్థలాన్ని కబ్జా కాకుండా కాపాడాలని, కబ్జా చేసిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రాముని చెరువు వాకర్స్ సభ్యులు, సింగరేణి విశ్రాంత కార్మికులు, సీనియర్ సిటిజన్స్ మంచిర్యాల సభ్యులు శనివారం అడిషన్ కలెక్టర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వినతిపత్రం అందించారు.

భీమిని: పల్లెల్లో పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్, ట్రైయినీ కలెక్టర్ గౌతమి అన్నారు. మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామపంచాయతీని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో రోజువారీ కార్యక్రమాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పర్యావరణ కార్యక్రమంలో భాగంగా రాంపూర్‌లోని చెరువులోని చెత్తాచెదారాన్ని తొలగించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నతిమ్మాపూర్ గ్రామంలోని పల్లెప్రకృతివనాన్ని పరిశీలించారు. మొక్కలను సంరక్షించాలని సూచించారు. వారివెంట డీఎల్‌పీఓ ఫణీందర్‌రావు, ఎంపీఓ సబ్దర్‌ఆలీ, ఏపీఓ భాస్కర్ రావు, ఆయా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ షాపులో ఆకస్మిక తనిఖీ

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని హన్మాన్ ఆగ్రోస్ విత్తనాలు, ఎరువుల దుకాణంలో శనివారం వ్యవసాయ శాఖ, పోలీసు అధికారుల టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. విత్తనాల దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ సురేఖ మాట్లాడుతూ.. షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు ప్రభుత్వం సిఫారసు చేసిన ఎరువులు , విత్తనాలు మాత్రమే అమ్మాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్సై విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా..!



ప్రజాప్రతినిధుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు

లక్సెట్టిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అన్నం మంగ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఇద్దరు సర్పంచులు, ఇద్దరు ఎంపీటీసీలు, వైస్ ఎంపీపీ, జెడ్పీటీసీ మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. గ్రామాల్లోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్ కార్యాచరణ కోసం మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు హాజరుకాకపోవడంతో గ్రామాల అభివృద్ధి ఎలా జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ పంట కాలువలు మరమ్మతు చేయడం లేదని, దీంతో పొలాలకు నీరు సరిగా అందడం లేదని ఖరీఫ్ సీజన్ సమీపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఇరిగేషన్ జేఈ అశ్విన్‌ను జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య నిలదీశారు. మద్రిపల్లిలో విద్యుత్ స్తంభాలు సరిగా లేవని, వెంటనే మరమ్మతు జరిపించి స్తంభాలు ఏర్పాటు చేయాలని తిమ్మాపూర్ సర్పంచ్ రవి జేఈ గణేష్‌కు విన్నవించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో ప్రజాప్రతినిధుల కోరం లేనప్పటికీ అధికారులు సమావేశాన్ని నిర్వహించి మమా అనిపించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఇంధన శక్తిని వృథా చేయొద్దు



మాట్లాడుతున్న అబ్దుల్‌ఖాధీర్

శ్రీరాంపూర్: ఇంధన శక్తిని వృథా చేయొద్దని, పొదుపుగా వాడుకోవాలని ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్‌ఖాధీర్ తెలిపారు. గనిపై శనివారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎనర్జీ సేవ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. ఏ రకమైన ఇంధన శక్తినైనా కూడా పొదుగా వినియోగించుకోవాలన్నారు. ప్రతి చిన్న పనికి వాహనాలను వినియోగించి డీజిల్, పెట్రోల్ ఇంధనాలను ఖర్చు చేయొద్దన్నారు. కాలుష్య కారకాలను నియంత్రిస్తేనే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీ నీలం సదయ్య తదితరులు పాల్గొన్నారు.

వేసవి జాగ్రత్తలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ లోకనాథ్‌రెడ్డి

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీలో శనివారం వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్మికులకు అవగాహన కల్పించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎండాకాలంలో వీలైనంత ఎక్కువగా మంచినీళ్లు తాగాలన్నారు. ఎండదెబ్బ తగలకుండా తలపాగా చుట్టుకోవాలని సూచించారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఓసీ ఇన్‌చార్జి మేనేజర్ రామరాజు, సంక్షేమాధికారి వంశీ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఠాగూర్‌స్టేడియంను సందర్శించిన జీఎం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి ఠాగూర్‌స్టేడియంను ఏరియా జీఎం మోహన్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ నెల 22నుంచి 24వరకు స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. పోటీల నిర్వహణకు సింగరేణి తరఫున తమ పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ పట్టణ ఇన్‌చార్జి గాండ్ల సమ్మయ్య ఆయా డిపార్ట్‌మెంట్ల అధికారులు, క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పాతమంచిర్యాల: బలహీన వర్గాలకు సామాజిక న్యాయం అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధివిధానాలు రూపొందించాలని రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు, గౌరవ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఏ.రాంభావ్ అన్నారు. బలహీన వర్గాల సాధికారత అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం నాయకులు శఠగోపం, చిరంజీవి, కొండ శ్రీనివాస్, బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

24న గౌడ కులస్తుల ఆత్మీయ సమ్మేళనం

జన్నారం: క్యాతన్‌పల్లి ఎస్‌వీఆర్ గార్డెన్‌లో 24న గౌడ సోదరుల ఆత్మీయ సమ్మేళనం ఉంటుందని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల ముఖేశ్‌గౌడ్, జన్నారం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్‌గౌడ్ తెలిపారు. సమ్మేళనానికి ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాసగౌడ్, షాట్స్ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, టీఎస్‌టీటీసీఎఫ్‌సీ చైర్మన్ రవికుమార్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లాలోని గౌడ కులస్తులు, గీత కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

'విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు'

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పెర్కపల్లిలో శనివారం పర్యటించారు. గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కోటపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అధికారంలోకి వస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని నియోజకవర్గ పీసీసీ సభ్యులు రమేశ్ అన్నారు. పుల్లగామలో హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో భాగంగా శనివారం ఇంటింటా కాంగ్రెస్ పార్టీ పథకాలను వివరిస్తూ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను గ్రామస్తులతో చర్చించారు.ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు రైతులకు ఏక కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేశ్ ప్రసాద్, నాయకులు సంపత్, సుఖేందర్, తిరుపతి పాల్గొన్నారు.